# ఆదిలాబాద్-మంచిర్యాల



# సూర్య

www.suryaa.com

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్

సోమవారం 25 నవంబర్ 2024 , పేజీ 04


## ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టాలి

### - సీపీఎం ప్రతినిధి బృందం సభ్యుడుశంభు

**నిర్మల్ నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్**



ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టాలని సీపీఎం ప్రతినిధి బృందం సభ్యుడు తుడసం శంభు ప్రభుత్వాన్ని కోరారు. నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లిలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సీపీఎం ప్రతినిధి బృందం సభ్యులుపరిశీలించి మాట్లాడారు. రైతుల నుంచి అదనంగా వరిని తీసుకోవడం, గన్నీ బ్యాగుల కొరత, డబ్బుల చెల్లింపులో జాప్యం వంటి వాటిని పరిశీలించినట్లు తెలిపారు.. సమస్యలు పరిష్కరించాలన్నారు.

## సర్వే ప్రక్రియలో

# వివరాల నమోదు కీలకం



- ◈ సర్వే ప్రక్రియలో నిర్దిష్ట నమూనాలో సేకరించిన ప్రతి అంశానికి సంబంధించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి
- ◈ గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలి
- ◈ సంబంధిత పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి
- ◈ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

2 లో

## డిజిటల్ మాధ్యమాలకు

# బలవుతున్న బాల్యం



- ✸ ఫోన్, టీవీ, గంటల తరబడి కాలక్షేపం
- ✸ నిద్రాహారాలకూ దూరం
- ✸ చుట్టుముడుతున్న ఆరోగ్య సమస్యలు

చదువుకుంటూ, ఆడుకుంటూ హాయిగా కాలం గడపాల్సిన వయసులో చిన్నారులు టీవీలు, సెల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు.వాటిని చూస్తూ నిద్రాహారాలు కూడా మరిచిపోతున్నారు. సెల్ ఫోన్ చేతిలో ఉంటే చాలు. డిజిటల్ మాద్యములకు బాలై పోతున్నారు చిన్నారులు. గత కొన్ని సంవత్సరాలుగా చిన్నారుల్లో ఈ ధోరణి బాగా ప్రబలుతుంది దేశంలోని చిన్నారులంతా ఎక్కువ శాతం మంది టీవీలు సెల్ ఫోన్లు ఇతర డిజిటల్ మాధ్యమాలను చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు. రెండు నుండి గు గంటల పాటు టీవీలు,ఫోన్లు చూపుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని ఇటీవల జరిపిన అధ్యయనం తెలింది. కరుణ రాకముందు నుండి కంటే కరోనా వచ్చిన తర్వాత చిన్నారులు డిజిటల్ మాధ్యమాలకు బానిసలు అయినట్లు అధ్యాయం వెల్లడించింది. మారుతున్న కాలంతో పాటు ఇంటర్నెట్, ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉండడమే దీనికి కారణం అని అధ్యయనాలు చెబుతున్నాయి.డిజిటల్ మాధ్యమాలకు బానిసలవుతున్న చిన్నారులు.

ప్రత్యే కథనం 2లో

## సర్వేలో సేకరించిన

## సమాచారాన్ని పోర్టల్‌లో


## నమోదు చేయడం కీలకమైన అంశం

**- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు**



**ఆసిఫాబాద్ ప్రతినిది 24 నవంబర్ సూర్య మేజర్ న్యూస్**

ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో సేకరించిన కుటుంబ సభ్యుల సమాచారాన్ని ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయడం కీలకమైన అంశమని రాష్ట్ర



ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం జార?ండ్ రాజధాని రాంచి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగితా... 3లో

### కాంగ్రెస్ పార్టీలో

# వేడెక్కిన రాజకీయాలు బయట పడ్డ కుమ్ములాటలు

V/S



3 లో

## సఫారీలో కవ్వాల్ అందాలను తిలకించిన కలెక్టర్

**జన్నారం, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్ :**

కవ్వాల్ టైగర్ జోన్ లో ఆదివారం సాయంత్రం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సఫారీలో పర్యటించారు. ఈ సందర్భంగా కవ్వాల్ అందాలను తిలకించారు. సఫారీలో వెళ్తున్న సమయంలో అడవిలో ఉన్న వివిధ రకాల జంతువులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా అడవిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కవ్వాల్ అడవిలో తిరగడం ఆనందంగా ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. అడవి ప్రకృతి అందాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జన్నారం ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు, సిబ్బంది ఉన్నారు.



సూర్య

సోమవారం 25 నవంబర్ 2024

## సర్వే ప్రక్రియలో వివరాల నమోదు కీలకం

### - రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

**మంచిర్యాల ప్రతినిధి,నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో ఎన్యూమరేటర్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని పోర్టల్‌లో స్పష్టంగా నమోదు చేయడం కీలక ప్రక్రియ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సర్వే వివరాల నమోదు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని డాటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా సంబంధిత పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో నిర్దిష్ట నమూనాలో సేకరించిన ప్రతి అంశానికి సంబంధించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి అంశాలలో సంబంధిత ఇంటి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అందుబాటులో ఉండమని కోరి, సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు చెల్లించే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 1 లక్షా 53 వేల 29 ఇండ్లు ఉండగా ఇప్పటి వరకు 101.73 శాతంతో 1 లక్షా 55 వేల 681 ఇండ్లు సర్వే చేయడం జరిగిందని, ఇండ్ల నమోదు ప్రక్రియలో గుర్తింపబడని ఇండ్లను సైతం గుర్తించి సర్వే చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో 1 లక్ష 1 వెయి 140 ఇండ్లు ఉండగా ఇప్పటివరకు 97 వేల 742 ఇండ్లను సర్వే చేయడం జరిగిందని, జిల్లాలో మొత్తంగా 2 లక్షల 54 వేల 169 ఇండ్లకు



గాను 99.71 శాతంతో 2 లక్షల 53 వేల 423 ఇండ్లు సర్వే చేయడం జరిగిందని తెలిపారు. సర్వేలు సేకరించిన సమాచారాన్ని ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేసేందుకు అవసరమైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లాలో డాటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ప్రతిరోజు అధికారుల సమన్వయంతో పాఠశాలలను సందర్శించి ఆహారం నాణ్యత, పరిసరాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మాధ్యమాలకు

# బలవుతున్న బాల్య

**తిర్యాణి,సూర్య మేజర్ న్యూస్**

సాంకేతిక పరిజ్ఞానాన్ని విపరీతంగా వాడుతూ దానిపై ఆధారపడడాన్నే స్క్రీన్ అడిక్షన్ అంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఓ వ్యసనం. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు, టీవీలు దీనికి సాధనాలు. రోజువారీ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతున్నప్పటికీ ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం బాగా పెరుగుతోంది. ముఖ్యంగా పని ప్రదేశంలో, విద్యాసంస్థల్లో వీటి అవసరం ఎక్కువ. సామాజిక సంబంధాలను పెంచుకోవడానికి కూడా వీటి పైనే ఆధారపడుతున్నారు.

### రెండేండ్లు నిండకముందే....

దేశంలో 52 శాతం మంది చిన్నారులు రోజుకు రెండు గంటలకు పైగా డిజిటల్ మాధ్యమాలకు దాసోహమంటున్నారని ఓ ఆన్లైన్ సర్వే తెలిపింది. ఆందోళన కలిగించే విషయమేమంటే 15-18 నెలల వయసున్న పిల్లలలో సైతం 88 శాతం మంది రోజుకు గంటకు పైగా స్క్రీన్ ఆధారిత మీడియాకు అలవాటు పడుతున్నారు. సంవత్సరంన్నర వయసు కూడా రాకముందే ఇలా డిజిటల్ మాధ్యమాలకు అలవాటు పడడం వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా మయోపియా (దూరపు వస్తువులను స్పష్టంగా చూడలేకపోవడం), నిద్రలేమి వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి పిల్లలలో ఎదుగుదల కూడా ఆలస్యమవుతోంది.

### ఎన్నో అనర్థాలు..

ఇక యువత సంగతి చెప్పనక్కర్లేదు. వారిలో14-25 శాతం మంది తమ స్మార్ట్‌ఫోన్లపై మూడు గంటల కంటే ఎక్కువ సమయమే గడుపుతున్నారు. దీంతో వారు శారీరక శ్రమకు దూరమవుతూ మానసిక ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. ఆందోళన,



నిరాశకు గురవుతున్నారు. 'సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ఇవాళ పిల్లలకు మునివేళ్లపై ఎంతో సమాచారం అందుబాటులో ఉంటోంది. అయితే విచారకరమైన విషయమేమంటే ఈ సమాచారంలో ఎక్కువ భాగం మన చుట్టూ ఉన్న డిజిటల్ స్క్రీన్లలోనే లభిస్తోంది' అని తిరునల్వేలిలోని కావేరీ ఆస్పత్రికి చెందిన పిల్లల నిపుణురాలు డాక్టర్ అన్నే ప్రవీణ గురుశేఖర్ చెప్పారు. ఎక్కువసేపు తెరను చూస్తూ గడపడం వల్ల కలిగే ప్రభావాన్ని ఆమె వివరిస్తూ 'తెర ముందు ఎక్కువ సేపు గడిపే చిన్న పిల్లలకు మాటలు రావడం ఆలస్యమవుతుంది. వారిలో జ్ఞాపకశక్తి కూడా తక్కువగా ఉంటుంది. ప్రవర్తనలోనూ మార్పులు వస్తాయి. సామాజిక నైపుణ్యాలు అలవడడంలో జాప్యం జరుగుతుంది. నిరాశ, ఆందోళన అనేవి సహజంగా వచ్చే సమస్యలే' అని తెలిపారు.

### ఏం చేయాలంటే...

పిల్లలు ఎక్కువ సమయం డిజిటల్ మాధ్యమాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. చిన్నారులను వేరే వ్యాపకాల వైపు మళ్లిస్తే అనేక సమస్యలు దూరమవుతాయి. ఈ విషయంలో ఏం చేయాలనే విషయంపై ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం రెండు సంవత్సరాలలోపు వయసున్న పిల్లలను స్క్రీన్కు దూరం చేయాలి. బంధువులకు అప్పుడప్పుడూ వీడియో కాల్స్ చేసి చూపించవచ్చు. 2-5 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు రోజుకు గంటకు మించి ఏ విధమైన తెర వైపు చూడకూడదు. కొంచెం పెద్ద వయసున్న పిల్లలు, యువత ఇతర కార్యకలాపాలతో స్క్రీన్ సమయాన్ని సమన్వయం చేసుకోవాలి. ఇతర కార్యకలాపాలు అంటే ఓ గంట పాటు ఆటలు ఆడాలి. తగినంత సమయం నిద్ర పోవాలి. స్కూల్ వర్క్ చేసుకోవాలి. భోజనానికి, ఇతర హాబీలకు, కుటుంబంతో గడపడానికి సమయాన్ని కేటాయించాలి. భోజనం చేసేటప్పుడు టీవీ, ఫోన్ ఉపయోగించకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడలు, కళలు వంటి వాటిపై ఆసక్తి కలిగించాలి. మానవ సంబంధాలు పెంచుకునేలా ప్రోత్సహించాలి. ఫోన్, టీవీ చూస్తుంటే మధ్యలో కొంత విరామం ఇచ్చేలా చూడాలి.

## అటవీ ప్రాంతంలో మృతి చెందిన యువకుడు

**కడెం,నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్ :**

అటవీ ప్రాంతంలో యువకుడు మృతి చెందిన ఘటన కడెం మండలంలోని మారుమూల గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం కడెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడెం మండలంలోని అల్లంపల్లి గ్రామానికి చెందిన కస్తూరి రమేష్ అనే 24 సంవత్సరాల వయస్సు గల యువకుడు తన కుటుంబంతో కలిసి మండలంలోని దత్తోజిపేట్ గ్రామంలో నివాసముంటు కూలి పని చేసుకుంటూ జీవితం వెల్లదీస్తున్న క్రమంలో నిన్న శనివారం కూలి పనికి వెళ్లి రాత్రికి ఇంటికి తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు సమీప అటవీ ప్రాంతంలో వేతుకగా ఆదివారం ఉదయం రమేష్ నురుగులు కక్కుకొని మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తన భర్త శరీరంపై ఎలాంటి గాయాలు లేవని తన చనిపోవడానికి గల కారణాలపై దర్యాప్తు చేయాలని పోలీసులకు మృతుని భార్య శిరీష ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి వెల్లడించారు.

## ఉట్నూర్ మండలంలో ఘనంగా ఎన్.సి.సి దినోత్సవ వేడుకలు

**ఉట్నూర్ నవంబరు 24 సూర్య మేజర్ న్యూస్**

ఉట్నూర్ మండలంలోని లాల్ టెక్డి గ్రామంలో ఉన్నా గిరిజన గురుకుల పాఠశాలలో ఆదివారం 78వ జాతీయ ఎన్.సి.సి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్.సి.సి క్యాడేట్ల నుండి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిరామ్ ఉపాధ్యాయులు గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ హరిరామ్ మాట్లాడుతూ.. ఎన్.సి.సి విద్యార్థులు దేశ ఐక్యత కోసం దేశరక్షణ కోసం క్రమశిక్షణతో కలిగి ఉండాలన్నారు. అలాగే ఎన్.సి.సిలో పాల్గోనడం వల్లన భవిష్యత్తులో సైనికులుగా దేశసేవలో పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు. ఏఎన్ఓ మధురావు, వైస్ ప్రిన్సిపాల్ రామనాథం ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



## 10 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

**వాంకిడి ,నవంబర్ 24,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని బంబార గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం దాడులు



నిర్వహించి 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. వారి వద్ద రూ.4,500 నగదు పట్టుబడిందని, 10 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

## సర్వేలో కుటుంబ సభ్యుల

# వివరాలు నమోదు చేయించాలి

### - జైనూర్ ఎంపీడీఓ సుధాకర్

**జైనూర్ నవంబర్ 24 సూర్య మేజర్ న్యూస్**

జైనూర్ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయని వారి కోసం జైనూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జైనూర్ ఎంపిడిఒ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో నేటికి 95శాతం పూర్తి చేయబడిందని, సర్వేలో నమోదు చేయించలేని వారి కోసం జైనూర్ తహసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్రూం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఎవరైన కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయనిచో 8919085386 నంబర్లో సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోవాలని, లేదా సంబంధిత పంచాయతి కార్యదర్శిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

### సర్వేలో సేకరించిన సమాచారాన్ని పోర్టల్ లో
## నమోదు చేయడం కీలకమైన అంశం
### - రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే డేటా ఎంట్రీ లో నాణ్యత చాలా ముఖ్యమైందని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం జరిగినట్లయితే సంబంధిత కుటుంబ సభ్యులకు ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేసి వివరాలను సేకరించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధరీకరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల మెస్, కాస్మొటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇంకా ఎవరికైనా తమ ఇంటి సర్వేకు ఎన్యూమరేటర్లు రాకపోతే తెలియజేయడానికి కంట్రోల్ రూం నెంబర్ 6304686505 ఏర్పాటుచేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్ లకు తెలిపినా ఎన్యూమరేటర్లని సర్వేకు పంపించి వివరాలు సేకరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎంఎస్ఎస్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా విద్యాధికారి

**ఖానాపూర్, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్,**

ఖానాపూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో జరుగు ఎన్ఎంఎస్-ఎస్ పరీక్ష కేంద్రాలను జిల్లావిద్యాధీకారి రామారావు పరిశీలించారు. ఆదివారం జిల్లాలో జరుగుతున్న ఎన్ఎంఎస్ఎస్ పరీక్షలకు నిర్మల్ లో 2, భైంసా లో 2, ఖానాపూర్ లో 1 ,మొత్తం 5 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ పరీక్షా కేంద్రాలలో అన్నీ వసతులు కల్పించామని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని, కాపీయింగ్ కి పాల్పడొద్దని జిల్లా విద్యాధికారి సూచించారు. ఖానాపూర్ కేంద్రంలో మొత్తం 237 విద్యార్థులకు గాను 237 మంది 100% మంది హాజరు అయ్యారని, ఎవరు గైర్హాజరు కాలేదని వారు తెలిపారు. ఇందులో మండల విద్యాధీకారి ప్రేమ్ సాగర్, ఏఎస్సై లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



### పలు వివాహ శుభ కార్యక్రమాలకు హాజరైన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్

**ఇచ్చోడ, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్,**

మండలంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో బోథ్ మండల కేంద్రానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కురుమే మోహన్ కూతురి మరియు పాటుపటి తాండ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ అంబరావు కుమరుని రిసెప్షన్ కి హాజరై నూతన- వధూవరులను ఆశీర్వదించారు ఆయన వెంట బోథ్ మండల మాజీ అధ్యక్షుడు కురమే మహేందర్, మాజీ సర్పంచ్ ఆడే జనార్ధన్ మధుకర్ ,రామ్ లఖన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు. ఈ వివాహ కార్యక్రమానికి విచ్చేశారు.



## కాంగ్రెస్ పార్టీలో వేడెక్కిన రాజకీయాలు బయట పడ్డ కుమ్ములాటలు
### - ఎమ్మెల్యే పిఎస్సార్ వై ఎమ్మెల్యే వివేక్, ఎంపి వంశీకృష్ణ

**మందమర్రి, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్.**

మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు వేడెక్కి కుమ్ములాటలు బయటపడ్డాయి. పాలన ప్రతినిధులచే తాజాగా జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో 655 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పూజ కార్యక్రమం సందర్భంగా స్థానిక ఎంపీని ఆహ్వానించక పోవడంతో కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్య పోరుతో విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు లను ఆహ్వానిస్తూ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ముద్రించిన ఆహ్వాన పత్రికలో స్థానిక ఎంపీ వంశీ కృష్ణ పేరు లేకపోవడంతో ఎంపీ అభిమానుల్లో తీవ్ర నిరాశకు గురై అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

#### వర్గ పోరుతో గతంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన వాయిదా

గత ఆగస్టు నెలలో రామగుండంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించాల్సి ఉండగా వర్షాల కారణం చూపుతూ చివరి క్షణంలో వర్గ పోరుతో ఉప ముఖ్యమంత్రి పర్యటన రద్దయింది. ఈ నేపథ్యంలో పర్యటన రద్దు వెనుక మంచిర్యాల ఎమ్మెల్యే పిఎస్ఆర్ హస్తం ఉందని వివేక్ అనుచరులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ జన సమీకరణ చేసి ఏర్పాట్లు చేసినప్పటికీ చివరి క్షణంలో పర్యటన రద్దు కావడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీలో మొదటిసారి వర్గ విభేదాలు బయట పడ్డాయి. అప్పటి నుండి సజావుగా సాగినప్పటికి తాజాగా రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో ఎంపీని స్వయాన సొంత పార్టీకి చెందిన ఎంపీని పిలువక పోవడంతో కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు మరో సారి వెలుగు చూశాయి.

#### మంత్రి పదవి కోసమేనా కీచులాటలు..?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదికారం కావస్తున్నప్పటికీ మంత్రివర్గ విస్తరణ జరగకపోవడం ఉమ్మడి జిల్లా నుండి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో మంత్రి పదవిపై జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మంత్రి పదవి రేసులో తూర్పు జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తుండగా ముఖ్యంగా మంచిర్యాల, చెన్నూర్ ఎమ్మెల్యేలు పిఎస్సార్, వివేక్ మధ్య తీవ్ర పోటీ నెలకోనగా మంత్రి పదవి పోటీలో నాయకుల మధ్య ఉన్న విభేదాలు బయట పడుతున్నాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే వివేక్ ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్లో కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనుభవంతో తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ అసెంబ్లీ ఎన్నికల ముందు బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మంత్రి పదవిపై హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతుంది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గత దశాబ్ద కాలంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ బీఆరెస్ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని జిల్లాలో పార్టీని, క్యాడర్ ను కాపాడుకుంటూ టిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా నిలిచారని చెప్పవచ్చు. బోథ్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచిన వెడ్మ బొజ్జు పటేల్ మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచారు. జిల్లాలో మంత్రి పదవిపై పిఎస్సార్, వివేక్ మధ్య తీవ్ర పోటీ నెలకొందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మంత్రి పదవిపై పీఎస్సార్ వివేక్ లు ఎవరికి వారుగా పార్టీ అధిష్టానంతో తమ వంతు ప్రయత్నాలు చేస్తుండటంతో జిల్లాలో మంత్రి పదవి ఎవరికి వరిస్తుందోనని వారి వారి అభి మానులు కళ్ళల్లో వత్తులు పెట్టుకొని ఎదుచూస్తున్నారు. ఇదిలా ఉండగా మంత్రి పదవి రేసులో పోటా పోటీగా ఉన్న నాయకులు జిల్లాలో వర్గ విభేదాలకు తెర తీయడంతో ప్రశాంతంగా ఉన్న జిల్లా అదికార పార్టీలో వర్గ విభేదాలు చాప కింద నీరులా ఉన్నప్పటికీ అమాత్యుల పర్యటన సందర్భంగా జిల్లా పార్టీలో ఉన్న వర్గ విభేదాలు ఒక్కసారిగా వెలుగు చూస్తున్నాయి. ఏదేమైనప్పటికీ జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ విభేదాలను పక్కన పెట్టి నాయకుల ఐక్యతకు పార్టీ అధిష్టానం దృష్టి సారించి జిల్లా కాంగ్రెస్ పార్టీలో విభేదాలు లేని పార్టీగా తీర్చి దిద్దాలని పలువురు కోరుతున్నారు.



#### ప్రోటోకాల్ పాటించాలి...
#### అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి తుంగపిండి రాజేష్ కుమార్

జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి స్థానిక ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించాల్సి ఉన్నప్పటికీ ప్రోటోకాల్ ను విస్మరించి ఎంపీని ఆహ్వానించక పోవడం రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదం. రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా ఎంపీ పేరును ఆహ్వాన పత్రికలో ముద్రించక పోవడం కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం ముమ్మాటికి రాజ్యాంగ విరుద్ధ చర్య అని ఇలాంటి ఘటనలు మరోసారి చోటు చేసుకోకుండా ప్రోటోకాల్ ను పకడ్బందీగా అమలు చేయాలని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని అధిష్ఠానాన్ని కోరారు.

### సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్
## నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులకు అవగాహన సదస్సు

**భైంసా టౌన్,నవంబర్ 24,సూర్య మేజర్ న్యూస్**

సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నిజామాబాద్ జిల్లాలో సామాజిక సేవ చేయాలని, సభ్యులుగా చేరిన వారికి బాల్యవివాహాలను అరికట్టడం,అంటరానితనం నిర్మూలన,బాల కార్మికుల నిర్మూలన,యువత మత్తుకు చిత్తు, ప్రభుత్వ పాఠశాలలో తరగతుల నిర్వహణ,ప్రభుత్వ వసతి గృహాలలో భోజనం మేను ప్రకారం అందిస్తున్నారా లేదా?అవినీతి అక్రమాలను అరికట్టడం, లంచగొండితనాన్ని నిర్మూలించడం,స్త్రీలను గౌరవించడం,ఆత్మహత్యల నిర్మూలన,బడుగు బలహీన వర్గాల ప్రజల వారికి సామాజిక న్యాయం జరుగుతుందా లేదా అనే పలు అంశములపై నిజామాబాద్ కార్యాలయములో శనివారం జాతీయస్థాయి,రాష్ట్రస్థాయి ప్రతినిధులు కొత్త కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించి, సమాజానికి మరింత సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు.అదేవిధంగా సామాజిక సేవ చేయాలని ఆసక్తి కలిగిన అభ్యర్థులకు ఆర్గనైజేషన్ లో చేర్పించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్,సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ గంప హనుమా గౌడ్, ఉభయ తెలుగు రాష్ట్రాల రీజినల్ చైర్మన్ వేణు కుమార్,తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ మాలెపు నారాయణ, ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి నిజామాబాద్ జిల్లా చైర్మన్ రామా గౌడ్, వర్కింగ్ కమిటీ చైర్మన్ రాజేందర్, అబ్జర్వేషన్ కమిటీ చైర్మన్ గొల్ల సంతోష్ మరియు నిజామాబాద్ జిల్లా వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సూర్య
సోమవారం 25 నవంబర్ 2024

## పాఠశాలకు బీరువాను విరాళంగా అందజేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కడారి దశరథ్



**భైంసా రూరల్,నవంబర్ 24,సూర్య మేజర్ న్యూస్**

భైంసా మండలం వానల్ పాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కడారి దశరథ్ వారి తండ్రి కడారి భోజన్న గారి జ్ఞాపకార్థం వానల్ పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 9000 రూపాయల విలువగల బీరువాను విరాళంగా అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుల గంగాధర్ మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా బీరువాను విరాళంగా అందించిన కడారి దశరథ్ ను అభినందించి ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణపతి,శేఖర్ వర్మ,అమిత్ నాయక్,మాలతి,రమేష్ ,రాజేశ్వర్ రెడ్డి,గ్రామస్థులు దగ్గే భూషణ్,సిరిమని భోజన్న ,పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రంగంపేట పీఠాదీశ్వరులు మాధవానంద స్వామి వారి యంత్రమూర్తి స్థిర ప్రతిష్టాపన మహోత్సవ ఆహ్వానం

**నిర్మల్ నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్**

డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావుకి రంగంపేట పీఠాధీశ్వరులు జగత్ గురువులు మాధవానంద స్వామి వారిచే యంత్రమూర్తి స్థిర ప్రతిష్టాపన మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేసిన ముధోల్ మండలం అష్ట రామాలయ గ్రామ కమిటీ .డిసెంబర్ నెల 3,4,5 వరకు వేద పండితులచే నిర్వహించు ప్రతిష్ట కార్యక్రమానికి రావాలని సంతోష్ రెడ్డి ,పోశెట్టి ,అశోక్ ,ముత్యం తదితరులు మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు.

## అబ్దుల్ కలాం లెజెండరీ అవార్డు అందుకున్న సీనియర్ జర్నలిస్టు మట్టె రవీందర్

**మందమర్రి, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్.**

పాత్రికేయ వృత్తిలో శిఖర సమానుడు మట్టె రవీందర్ తెలుగు భాష మాధుర్యాన్ని జతచేసి, తన పదాల శైలితో లిఖించిన కవిత్వానికి గాను అరుదైన డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్ లెజెండరీ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి మినీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మట్టె రవీందర్ తన పదాల కూర్పుతో,అద్భుతమైన పంక్తులతో కవులను, రసహృదయులైన పాఠకులను ఆకట్టుకునేలా నిగూఢతను కలిగి మనసును రంజింపజేసే విధంగా రచించిన 'మహోన్నత శిఖరం' శీర్షికకు గాను చిత్రసీమ అతిరథుల సమక్షంలో,వేలాది మంది ప్రేక్షకుల మధ్య అరుదైన పురస్కారం అందుకున్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ సారథ్యంలో నిర్వహించిన అబ్దుల్ కలాం 93వ, సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి వేడుకలను పురస్కరించుకుని అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి జిల్లా ఎస్పీ తేజావత్ రాం దాస్, ప్రముఖ సినీ నటుడు సుమన్ హాజరై ఈ పురస్కారాలను అందజేశారు. ప్రముఖ పాత్రికేయుడిగా పని చేస్తున్న రవీందర్ కు ఈ అవార్డు రావడం పట్ల పట్టణ ప్రజలు, సహచర రిపోర్టర్లు అభినందించారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక ఔత్సాహికులు దైవజ్ఞ శర్మ, సీనియర్ నటీమణి జ్యోతి స్వరూప్, సినీ హీరో నరేన్ తేజ్, వంశీకృష్ణ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శివలీల, వాణి, లక్ష్మన్, పలువురు రచయితలు, కవులు, కళాకారులు, వివిధ రంగాల్లో సేవలందించి అవార్డులకు ఎంపికైన వారు హాజరయ్యారు.



## మాలల గోడ పత్రిక ఆవిష్కరణ

**శ్రీరాంపూర్, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్:**

నస్పూర్ మున్సిపాలిటీ లోని మాల సంక్షేమ సంఘం చలో హైదరాబాద్ మాలల సింహగర్జన గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ను ఆదివారం జేఏసీ కన్వీనర్ తోగరు సుధాకర్ ఆవిష్కరణ చేసినారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మాలల సంఖ్య రెండో స్థానంలో ఉందని, వారి యొక్క ఐక్యతను చాటాలని ఈ డిసెంబరు 1వ తేదీ ఆదివారం రోజున సికింద్రాబాద్లోని పరేడ్ గ్రౌండ్స్ జరగనున్నటువంటి మాలల సింహగర్జన కి, ప్రతి ఒక్కరూ హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపాలిటీలోని, మాల బాంధవులు, జిల్లా జేఏసీ నాయకులు, ఉద్యోగ జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం

**వాంకిడి నవంబర్ 24,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని కనర్గాం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వృద్ధులకు తమ కార్యకర్తలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారాన్ని సహకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దుర్గం జీవన్, నాయకులు మపాదె చరణ్. లింబారావు, మెంగాజీ, నారాయణ, సంతోష్, నాగభూషన్, జాడె సునిల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గాయాలకు గురైన బీట్ ఆఫీసర్ వెంకటేష్

**జన్నారం, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండలం పైడిపల్లి సమీపంలో గల రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతగూడ బీట్ ఆఫీసర్ వెంకటేష్ తీవ్ర గాయాలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంకటేశ్ ను చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట్, కరీంనగర్ తరలించారు. పరిస్థితి విషమించడంతో హుటాహుటిన హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. బైకుపై అడవికి వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందని పలువురు భావిస్తున్నారు. ఈ విషయంలో స్థానిక ఎస్సై రాజ వర్ధన్ ను సంప్రదించగా విచారణ జరిపి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## ఉట్నూర్ మండలంలో ప్రజాపాలన విజయోత్సవాలపై కళాకారుల అవగాహన

**ఉట్నూర్ నవంబరు 24 సూర్య మేజర్ న్యూస్ :**

ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడా, లక్కారం గ్రామాలలో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా డిపిఆర్ఓ ఆదేశాలతో కళాకారులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలన ప్రభుత్వ పథకాలపై కళాప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం, రైతురుణమాఫీ 500కే గ్యాస్ సమగ్ర కుటుంబ సర్వే తదితర పథకాలపై పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు గెడం ఆశిష్, ఆత్రం గోవింద్ రావు, నగేష్ రాథోడ్ శంకర్ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులకి హాని కలిగించొద్దు

### - ఎఫ్ఆర్ఓ సయ్యద్ మజారోద్దీన్

**కెరమెరి, నవంబర్ 24 సూర్య మేజర్ న్యూస్**

వన్యప్రాణులకు హాని కల్గించవద్దని,అటవీ సంపదను కాపాడవలిసిన బాధ్యత అందరిపై ఉందని జైనూర్, కెరమెరి బఫ్ఫార్ జోన్ ఫారెస్ట్ రేంజ్ అధికారి సయ్యద్ మజారోద్దీన్ అన్నారు. ఆదివారం జైనూర్ మండలంలోని గౌరి,కోలామ్ గూడా, గ్రామస్తులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. వన్యప్రాణుల దాడిలో పశువులు గాయపడిన, చనిపోయిన తక్షణ సాయం కింద రూ.5,000 అందిస్తామన్నారు. అనంతరం గ్రామానికి సంబంధించిన పంచాయతీ కార్యదర్శి, పశు వైద్యాధికారి నివేదిక ప్రకారం వెంటనే పూర్తిస్థాయిలో పరిహారం అందిస్తామన్నారు. వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని తెలిపారు.

## కారోబారి భార్య అనారోగ్యంతో మృతి

**జైనూర్ నవంబర్ 24 సూర్య మేజర్ న్యూస్**

జైనూర్ మార్లవాయి గ్రామపంచాయతీ కారోబారి జుగ్నక సోనేరావ్ భార్య రాధ బాయి ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఆత్రం సుగుణక్క మార్లవాయిలోని వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళు లర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించారు.రాధ బాయి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా సంతోషంగా ఉండవలసిన సమయంలో రాధ బాయి అకాల మరణం చెందటం బాధాకరమని కారోబారి జుగ్నక సోనేరావ్ ను సుగుణక్క ఓదార్చారు.

## ప్రమాదవశాత్తు యువకుడు మృతి

**కడెం,నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్ :**

కల్వార్ట్ మీదనుండి క్రింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన కడెం మండలంలో చోటుచేస్తుంది. ఆదివారం రోజున కడెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన తీగల రమేష్ 33 సంవత్సరాల వయసు గల యువకుడు గత రాత్రి తన ఇంటి సమీపంలో గల కల్వార్ట్ మీద నిద్రిస్తున్న క్రమంలో, గత రాత్రి కల్వార్ట్ మీద నుండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆదివారం ఉదయం మాసాయిపేట్ గ్రామస్తుల సమాచారం మేరకు కడెం ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు.

## తేజాపూర్ పాఠశాలకు కంప్యూటర్ విరాళం

**నేరడిగొండ, నవంబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన సామ అజయ్ రెడ్డి వృత్తి రీత్యా సీనియర్ రీసర్చ్ సైంటిస్ట్ గా పనిచేస్తున్నారు ఈయన తాను చదువుకున్న జిల్లా పరిషత్ పాఠశాలకు కంప్యూటర్ ని విరాళంగా అందజేశారు . పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మని లత, శ్రీనివాస్ గౌడ్, కిషోర్ కుమార్, వెంకట్రామిరెడ్డి, రేణుక, సుమన్,హరికృష్ణ, పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### 26 న రాజధానిలో

## చేయూత పెన్షన్ దారుల మహాధర్నా

### - విహెచ్పీఎస్ జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ

**మందమర్రి, నవంబర్ 24, సూర్య మేజర్ న్యూస్.**

ఈనెల 26న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన చేయూత పెన్షన్ దారుల మహా ధర్నాను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పీఎస్) జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేయూత పెన్షన్ దారులందరిని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఒక తాటిపైకి తీసుకువచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపడుతున్నామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు 2000 పింఛన్ ను 4000 పెంచాలని, దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్ 4000 నుండి 6000 లకు పెంచి వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. పంచాయతీ నుండి పార్లమెంటు వరకు దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించి, 2016 దివ్యాంగుల చట్టం అన్ని శాఖలలో అమలు చేయాలని, ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని, నామినేటెడ్ పదవులలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని, రైలు బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దివ్యాంగుల న్యాయమైన హక్కుల సాధనకు చేపట్టనున్న ధర్నాకు జిల్లాలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు ఆసరా ఫించన్ దారులు అధిక సంఖ్యలో తరలివచ్చి మన హక్కులను కాపాడుకునేందుకు, మన పెన్షన్లు సాధించుకునేందుకు నిర్వహిస్తున్న ధర్నా ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ నాయకులు రామ్ శ్రీనివాస్, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, వాసాల రాజు, రమేష్, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.